శాంతిభద్రతలు ఇక సులభం

- ఒకే స్టేషన్ పరిధిలోకి మండల గ్రామాలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సామర్లకోట: పరిపాలనా సౌలభ్యం కోసం ఒక పోలీసు స్టేషన్ పరిధిలోనే మండలంలో అన్ని గ్రామాలు ఉండాలని ప్రత్యేక జీఓ జారీ అయ్యింది. ఈ మేరకు ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు.

ఇప్పటి వరకు ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో వీకే రాయపురం, బోయనపూడి, మామిళ్లదొడ్డి, మాధవపట్నం ఉండేవి. ఉండూరు, పి.వేమవరం, గొంచాల, నవర, పవర, అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలు తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉండేవి. దాంతో సామర్లకోట సమీపంలో ప్రమాదాలు జరిగినా వేరు వేరు పోలీసు స్టేషన్లకు ఆయా గ్రామ ప్రజలు వెళ్ల వలసి వచ్చేది. ఇప్పటికే పెద్దాపురం సర్కిల్‌లో ఉండే సామర్లకోట పోలీసు స్టేషన్‌ను పోలీసు సర్కిల్‌గా గుర్తించారు.



సామర్లకోట పోలీసు స్టేషన్

సిబ్బందిని పెంచక పోతే సాగేదెలా!

మండలంలోని అన్ని గ్రామాలను ఒకే పోలీసు స్టేషన్ పరిధిలోనికి తీసుకు రావడం హర్షణీయమే అయినప్పటికీ సిబ్బందిని పెంచకపోతే నిర్వహణ కష్టమన్న ఆనందంగా ఉన్నా సిబ్బందిని పెంచక పోతే పరిపాలన కష్టమనే అభిప్రాయం పోలీసు వర్గాల్లో వినిపిస్తోంది. మరో ఇద్దరు ఎస్సైలను నియమించడంతో పాటు వారికి ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

పోరాటం ఫలించింది..



మండలంలోని గ్రామాలన్నీ ఒకే పోలీసు స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని కొన్నేళ్లుగా పోరాడుతున్నాం. హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు కృషితో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది. పోలీసు సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది.

– తలారి దొరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, వీకే రాయపురం

ఆదేశాలు అమలు చేస్తాం..



ఇది మంచి పరిణామం. మండలంలో అన్ని గ్రామాలకు ఒకే రకమైన పాలన అందుతుంది. మండలంలో ప్రజలు ఏ సమస్య ఉన్నా సామర్లకోట పోలీసు స్టేషన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

– కె.దుర్గాప్రసాద్, సీఐ, సామర్లకోట

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



సామర్లకోటలో రన్ ఫర్ జీసస్‌ను ప్రారంభించిన వైస్‌చైర్మన్ మోజెస్, సుబ్బారావులు



రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న దైవజనులు

సామర్లకోట: స్థానిక సీబీఎం గ్రౌండ్‌లో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ప్రతిభా స్కూల్ అధినేత ఎస్‌వీబీబీ ప్రకాష్‌లు శనివారం ప్రారంభించారు. సీబీఎం హైస్కూల్ నుంచి బ్రౌన్‌పేట, పాత పోలీస్‌స్టేషన్, కొట్లమ్మ చెరువు, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్ మీదుగా గాంధీ చౌక్, ఆంధ్రా బాప్టిస్టు చర్చి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఏసు క్రీస్తు మరణించిన మూడో రోజున సమాధిని గెలిచి పునరుద్ధనుడై లేచిన సందర్భాన్ని చాటి చెబుతూ క్రైస్తవులు కేరింతలు కొడుతూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా కేరింతల మధ్య సాగింది. మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు పి.ఆనందబాబు, కౌన్సిలర్లు పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు, జి. కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పెద్దాపురం: క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్థానిక లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీని బండి జయబాబు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ సెంటర్, మెయిన్‌రోడ్డు, దర్గా సెంటర్, పాత బస్టాండ్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ లంక పురుషోత్తమ్ దాను, పి.జాన్, సుకుమార్, జ్యోతిబాబు, సాల్మన్ రాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే ప్రభుత్వ పథకాలు



స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, స్థానిక నాయకులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- నవఖండ్రవాడలో గడపగడపకూ..

పిఠాపురం: లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలం నవఖండ్రవాడలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. ప్రజలకు ప్రభుత్వం అందజేసిన పథకాల వివరాలను ఎమ్మెల్యే చదివి వినిపించి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక తమ బతుకులు మారాయంటూ పలువురు మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన తన వెంట ఉన్న అధికారులకు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కుటుంబంలోనూ ఏదో ఒక పథకం వర్తించిందని, ఒకొక్క కుటుంబంలో నాలుగు నుంచి ఆరు పథకాలు అందుకుంటున్నవారు కూడా ఉన్నారని ఆయన అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందేలా చేసి అవినీతికి తావు లేకుండా చేశారన్నారు. అధికారులు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా జగనన్నే మా భవిష్యత్తు

సామర్లకోట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సామర్లకోట మండలంలో మంచి స్పందన లభిస్తుంది. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వాడవాడలా ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మున్సిపాలిటీల్లోను పార్టీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది.

స్టీవ్ డోర్ కార్మికులకు వేతనాల పెంపు

కాకినాడ సిటీ: కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ వాటర్‌పోర్టుల్లో పని చేసే స్టీవ్ డోర్ కార్మికులకు వేతనాలు పెంచినట్టు ఆ సిబ్బంది, కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి పితాని నూకరాజు తెలిపారు. శనివారం పోర్టులో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పెరిగిన వేతనాలు ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ట్రేడ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందం కుదిరిందన్నారు. కార్మికుల తరఫున తనతో పాటు నాయకులు చిన్ని భావనారాయణ, సుర్ల రాఘవేంద్రరావు, బొందు శివాసి, వరిపిల్లి బలరామ్, ఎస్‌కె బషీర్ తదితరులు పాల్గొనగా యాజమానుల తరఫున గాదం చంద్రశేఖర్, పీవీ రావు, అన్నవరపు వెంకటాచలం, ఎంఎస్ కుమార్, ఎం.సాయిరామ్ తదితరులు చర్చించినట్లు తెలిపారు. వేతనాల పెరుగుదలకు సహకరించిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రరెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం మేస్త్రీలకు, సూపర్‌వైజర్, ఫోర్‌మెన్‌లకు ఇచ్చే పండుగ బోనస్‌లు రూ. 3700 నుంచి రూ. 4 వేలు వరకు పెరిగినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి నూకరాజు తెలిపారు.

నాడు యాక్షన్.. నేడు రీయాక్షన్..

- కాపు కల్యాణ మండపం మళ్లీ కట్టేస్తున్నారు..
- మరోసారి ఆ వర్గాన్ని మోసం చేసే యత్నం
- అదంతా కట్టు కథేనని తేల్చేసిన అధికారులు
- వర్మా.. ఇదేం ఖర్మ అంటున్న ప్రజలు

పిఠాపురం: అక్కడకు ఓ ఆటో వచ్చి ఆగింది. ఇద్దరు వ్యక్తులు ఒక ఇనుప స్టాండ్‌ను అందులోంచి దించి, దానిపై ఒక శిలా ఫలకాన్ని పెట్టారు. ఇంతలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ వచ్చి దానిపై తెర తొలగించి చప్పట్లు కొట్టి ఆవిష్కరించి వెళ్లిపోయారు. ఆయన అలా వెళ్లారు ఇక్కడ శిలాఫలకం సెట్టింగ్ తీసుకుపోయారు. 'చెల్లికి పెళ్లి జరగాలి మళ్లీ మళ్లీ' డైలాగ్‌లా గత ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యేగా హడావుడి శంకుస్థాపనల్లో ఇలాంటి సెట్టింగులు ఎన్నెన్నో. మరో ఏడాదిలో ఎన్నికలు రానుండడంతో మళ్లీ రింగ్ మాస్టర్ అవతారం ఎత్తారు మాజీ ఎమ్మెల్యే వర్మ.

కాపు కల్యాణ మండపం కట్టుకథే..

ఐదేళ్లలో కాపులను కేసుల్లో ఇరికించి కోర్టుల చుట్టూ తిప్పిన టీడీపీ ప్రభుత్వం కాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50లక్షలు విడుదల చేసిందని వర్మ కట్టుకథలు అల్లుతున్నారని కాపు నేతలు మండిపడుతున్నారు. గతంలో ఎన్నికల కోడ్ వస్తోందనగా బీసీ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేసిన స్థలం ప్రభుత్వాసుపత్రి మార్చురీ స్థలం కాగా, కాపు కల్యాణ మండపానికి శంకుస్థాపన చేసిన స్థలం మున్సిపాలిటీది. ఇంత వరకు బానే ఉన్నా కాపు కల్యాణ మండపానికి తాను శంకుస్థాన చేసానని, దాని నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు తెచ్చానని, మున్సిపాలిటీలో తీర్మానం చేశామని దానిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆపేసిందని వర్మ ఆరోపిస్తున్నారు. కాగా అసలు కాపు కల్యాణ మండపానికి తీర్మానమే చేయలేదని, అసలు నిధులు ఒక్క పైసా కూడా వచ్చిన దాఖలాలు లేవని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ చెబుతున్నారు.

అసలేం జరిగిందంటే..

2019 ఎన్నికల నేపథ్యంలో కాపులను ఆకట్టుకోడానికి వర్మ వేసిన స్కెచ్ ఇది. పాలకవర్గం ఉన్న అప్పటి పిఠాపురం మున్సిపాలిటీలో ఓసీ కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయిస్తున్నట్లు ఒక తీర్మానం చేయించారు. అంతే అప్పటికప్పుడు ఒక ఫ్లెక్సీ తయారు చేసించి కొబ్బరికాయలు కొట్టేశారు. కాపు కల్యాణ మండపానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు బాహాటంగా ప్రకటించారు.



కొత్తపల్లి మండలం ఉప్పాడలో అన్న క్యాంటిన్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన 'సంచార శిలాఫలకం'

అసలు నిజం ఇదీ..

అయితే ఆయన శంకుస్థాపన చేసిన ఓసీ కల్యాణ మండపానికి కేవలం తీర్మానం మాత్రమే అయ్యింది. ఏదైనా ప్రభుత్వ స్థలాన్ని ఇతరులకు కేటాయించాలంటే ఆశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాలి. ఆ స్థలాన్ని ప్రభుత్వానికి రిజిస్టర్ చేయాలి. దానిని ప్రభుత్వం ఆయా సంఘాల పేరున ఇచ్చి నిధులు మంజూరు చేయాలి. కాని ఇందులో ఏ ఒక్కటి జరగలేదు. రూ.50 లక్షలు మంజూరు చేయించానని, వాటిని ఏం చేసారని వర్మ ప్రశ్నిస్తుండగా.. అసలు ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదని మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ తెలిపారు. అప్పట్లో కాంట్రాక్టర్ సైతం నిధులు మంజూరు కానందున తాను ఈ పనులు చేయలేనని లిఖిత పూర్వకంగా తెలిపినట్లు కమిషనర్ తెలిపారు. అసలు ఆ స్థలం కాపు కల్యాణ మండపానికి కేటాయించలేదని ఓసీ కల్యాణ మండపానికే కేటాయించినట్లు తీర్మానం ఉంది తప్ప అనుమతులు మాత్రం రాలేదని ఆయన తెలిపారు.

దుక్కి దున్నితే భూమికి దన్ను

- వేసవిలో యాజమాన్య చర్యలతో సత్ఫలితాలు
- లోతు దుక్కి వల్ల పంటలకు ఎంతో మేలు

పిఠాపురం: వ్యవసాయ సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో పొలాలను ఖాళీగా వదిలేయకుండా యాజమాన్య చర్యలు చేపడితే మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంట్లో భాగంగా మండే ఎండను సైతం భవిష్యత్తులో పండే పంటకు ఉపయోగించుకోవచ్చంటున్నారు. భూసార పరీక్షలు, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతు దుక్కులు వంటి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో మంచి ఫలితాలను రాబట్టుకునే వీలుంటుంది. ప్రధానంగా ఎండా కాలంలో భూములు ఖాళీగా ఉన్న సమయంలో లోతు దుక్కి చేయడం వల్ల ఎంతో మేలు కలుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రబీ ముగుస్తుండడంతో రైతులందరూ వచ్చే ఖరీఫ్‌కి ఏ పంట వేయాలి.. ఏ రకం విత్తనాలు చల్లుకోవాలి.. ఏ ఏ ఎరువులు సిద్ధం చేసుకోవాలి.. పంటల సాగుకు నేలను ఎలా సిద్ధం చేసుకోవాలి అంటూ ఆలోచిస్తుంటారు. రాబోయే పంటల కోసం ఇప్పటి నుంచే వనరులను సిద్ధం చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటల సాగు చేసుకునే వీలుంటుంది. అయితే వీటన్నికంటే ముందుగా ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండగానే లోతు దుక్కి వల్ల పంటలకు ఎంతో మేలు కలుగుతుందన్న విషయాన్ని అన్నదాతలు మరిచిపోకూడదు. ఇప్పుడు పాటించే యాజమాన్య చర్యల ద్వారా ఖరీఫ్ పంట దిగుబడుల్లో సత్ఫలితాలు కనిపిస్తాయని వ్యవసాయ శాఖాధికారులు ఘంటాపథంగా చెబుతున్నారు.



ఖాళీగా ఉన్న పంట పొలంలో వేసవిలో దుక్కు చేస్తున్న రైతు

లోతు దుక్కి చేసే విధానం

వేయే బోయే పంట కోసం ఇప్పటి నుంచి సాధారణంగా కల్టివేటర్ (ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలి) బదులుగా లోతు దుక్కి దున్నడానికి రెక్క నాగలి, బల్లెపు నాగలి, గునపపు నాగలి వాడితే నేల 30 నుంచి 75 సెంటీమీటర్లు భూమి లోతుకు దిగి ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. వాలుకు అడ్డంగా దుక్కి చేయడం వల్ల భూమి కోతకు గురి కాకుండా తేమ ఎక్కువగా పెరుగుతుంది. ఎక్కువ కాలం తగ్గకుండా ఉంటుంది. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉండడం వల్ల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి పొలంలో నాటుకు పోతాయి. దానివల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి పొలంలోను వేసవి లోదుక్కులు దున్నాలి. మామూలు నాగలితో కంటే ప్రత్యేకంగా ఉన్న నాగళ్లను ఉపయోగించడం ద్వారా పొలంలో ఒక అడుగుకు పైగా లోతు దుక్కి చేయడానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేసే భూమిని వేసవిలో దుక్కి దున్నడం వల్ల పంటకు నష్టం కలిగించే ఎరుపు, గులాబీ రంగు పురుగులు ఆదిలోనే నశించి రైతుకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

భూమి సారవంతమవుతుంది

వేసవిలో ట్రాక్టర్ల ద్వారా లోదుక్కులు చేయడం పంట పొలాలకు ఎంతో మేలు. భూమి గుల్ల బారుతుంది. వర్షపు నీరు సమృద్ధిగా భూమిలో ఇంకి ఎక్కువ కాలం పంటలకు తేమను అందిస్తుంది. కలుపు నివారణ ఎక్కువగా జరుగుతుంది.

– సత్యనారాయణ, వ్యవసాయ శాఖాధికారి, గొల్లప్రోలు

క్లుప్తంగా

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

విరాళాలు, టిక్కెట్ల ద్వారా రూ.4.06 లక్షల ఆదాయం



తిరుపతి శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పిలుచుకునే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే వేల సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు గంటల తరబడి నిలిచిపోయాయి. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి వారికి తులసీ మాలంకరణ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానానికి భక్తులు క్యూ కట్టారు. కాకినాడ జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వాహణాధికారి పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజే రూ.4,06,917 ఆదాయం వచ్చినట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు చెప్పారు.

ఘనంగా శ్రీ పుష్పయాగం

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో కొలువైన శ్రీ, భూ సమేత విజయజనార్దన స్వామి దివ్య కల్యాణాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నాగులాపల్లికి చెందిన శ్రీ స్నేహ చైతన్య ఆర్ట్ వారిచే బలిపీఠంపై భారతనారి సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. కల్యాణ మహోత్సవాలు ముగిసినట్లు ఈఓ బాదం శ్రీనివాస రామ చంద్రరావు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ, ఎంఈఓలు

సామర్లకోట: స్థానిక టీటీడీసీలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం సాయంత్రం డీఈఓ ఎస్‌వీఎస్ అన్నపూర్ణ పరిశీలించారు. యూనిఫాం కుట్టు చార్జీలు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండేందుకు టీటీడీసీలో కుట్టు శిక్షణ కేంద్రంలో విద్యార్థుల దుస్తులు కుట్టించాలని భావిస్తున్నారు. ప్ర భుత్వ పాఠశాలలోని విద్యార్థులతో పాటు ప్రైవే టు పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కూడా ఈ కుట్టు శిక్షణ కేంద్రానికి ఇచ్చి కేంద్రం అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ యోచిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఈ మేరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పా టు చేస్తామని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు.

చిత్ర పరిశ్రమ బలోపేతానికి కృషి



సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న మోహన్‌గౌడ్ తదితరులు

కాకినాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్ర పరిశ్రమను హైదారాబాద్‌కు సమాతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి జేవీ మోహన్‌గౌడ్ అన్నారు. స్థానిక బాలాజీ చెరువు సెంటర్‌లోని తహసీల్దార్ కార్యాలయం సమావేశపు మందిరంలో చిత్ర పరిశ్రమ అవగాహన సదస్సు ఛాంబర్ జిల్లా కో ఆర్డినేటర్ పీడీఆర్ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగింది. రాష్ట్రంలో చిత్రపరిశ్రమను బలోపేతం చేసే బాధ్యత మనందరిపై ఉందని మోహన్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో సినిమా చిత్రీకరణకు అనువైన ఎన్నో లొకేషన్లు ఉన్నాయని అన్నారు. అలాగే స్థానిక సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆంధ్రలో సినిమా చిత్రీకరిస్తే సబ్సిడీ ఉంటుందన్న విషయంపై సదస్సులో అవగాహన కల్పించారు. ఛాంబర్ జిల్లా కో ఆర్డినేటర్ పీడీఆర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణలకు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం తూర్పుగోదావరి ప్రాంతంలో చిత్రీకరించిన 'వారెవ్వా జతగాళ్లు' సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించి, సినిమా యూనిట్‌ను సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ మంతా శ్రీనివాస్, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ పిచ్చి రెడ్డి, నాగరాజువర్మ పాల్గొన్నారు.

సామర్లకోట పీఎస్ పరిధిలోకి 14 గ్రామాలు

కాకినాడ క్రైం: సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి 14 గ్రామాలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ కార్యాలయం తాజా ఉత్తర్వుల్లో వెల్లడించింది. కాకినాడ గ్రామీణం మండలం ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 4 గ్రామాలు, తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన 10 గ్రామాల శాంతిభద్రతలు ఇకపై సామర్లకోట పీఎస్ పరిధికి చెందనున్నాయి. ఇంద్రపాలెం పీఎస్ పరిధికి చెందిన మాధవపట్నం, వెంకటరాయపురం, బోయినపాడు, మామిళ్లదొడ్డి గ్రామాలతో పాటు తిమ్మాపురం పరిధికి చెందిన అచ్చంపేట, గొంచాల, పనసపాడు, నవర, పవర, ఉండూరు, పి.వేమవరం, కొప్పవరం, వల్లూరు, సీతారామపురం గ్రామాలు సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి విలీనం అయ్యాయి. సంబంధిత గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు.

భావి తరాలకు భరోసా సీఎం జగన్



వాకతిప్పలో లబ్ధిదారులతో ఆనాల సుదర్శన్

కొత్తపల్లి: సంక్షేమ పాలకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి భావి తరాలకు భరోసాగా నిలబడుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని వాకతిప్పలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు గ్రామ వలంటీర్లతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కార్యక్రమ స్టికర్‌ను అతికించారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరితే మరోమారు ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని స్థానిక కన్వీనర్లు నిర్వహిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేస్తున్న పారిశ్రామికవేత్త చంద్రమౌళి

సామర్లకోట: పెదపూడి బాణసంచా తయారీషాపులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాధితుల కుటుంబాలకు దోకుబుర్ర రాజు, పాలపాటి శేషారావుల కుటుంబాలకు పారిశ్రామికవేత్త గుణ్ణం చంద్రమౌళి శనివారం ఆర్థిక సాయం చేశారు. బాధితుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సాయాన్ని శనివారం ఆయన అందజేశారు. ఇరు కుటుంబాలకు చెందిన పిల్లల విద్యాభ్యాసానికి తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు అందుగుల జార్జి చక్రవర్తి, తాతపూడి కృష్ణబాబు, కాపవరపు కుమార్, కాళ్ల రవీంద్ర, పోలిపల్లి బాబి తదితరులు పాల్గొన్నారు.

నేడు సమతా త్రిమూర్తుల జయంత్యుత్సవాలు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వర్గీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను సమతా త్రిమూర్తులు పేరుతో నిర్వహించనున్నట్లు వేదిక నిర్వాహకులు తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌దే భవిత

- ఐటీ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భవిష్యత్‌లో అన్ని సెక్టార్లలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ కీలకం కాబోతోందని ఐటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కాకినాడ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ అంశంపై సదస్సు నిర్వహించారు. ఐటీ సంస్థలన్నీ ఏకతాటిపై ఉండి కొత్త సాంకేతికతపై అవగాహనతో పాటు ఎనలిటిక్స్‌లో కొత్త పరిణామాలు, తాజా పోకడలపై ఎంఎన్‌సీ సంస్థలు టెక్ మహీంద్ర, క్యాప్ జెమినీ వంటివి విశ్లేషించాయి.

రాష్ట్రంలో వైజాగ్ ఐటీ చాప్టర్ తరువాత ప్రధాన పాత్ర పోషించే దిశగా కాకినాడ చాప్టర్ అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం 40 సంస్థలు ఈ చాప్టర్‌లో ఉన్నాయన్నారు. వైజాగ్ సమ్మిట్ తరువాత ఐటీ కంపెనీలు మరింత చురుగ్గా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని కృష్ణారెడ్డి తెలిపారు. ఐటీఏపీ అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు ఐటీ నిపుణులు జె.కుమార్, లక్ష్మి, ఆర్ఎల్ నారాయణలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 140 మంది ఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.